# స్పెసిమన్

పొద్దుటే లేవడం అలవాటు లేకపోయినా, ఆరోజు అలారం పెట్టుకొని మరీ లేచాను.

ఆ రోజు నేను స్పెసిమన్ కోసం వెళ్లాల్సివుంది. స్పెసిమన్‌ని చలనం కోల్పోయిన పదిహేను నిమిషాల్లోగా లాబ్‌కి చేర్చాలని ప్రొఫెసర్‌గారు ఖచ్చితంగా చెప్పారు. ఆయన ఇంకొద్ది సేపట్లో లాబ్ దగ్గరికి వచ్చేస్తారేమో! ఆయన చాలా నిక్కచ్చి మనిషి.

మాకు ఎప్పుడూ స్పెసిమన్‌లు అలవాటుగా అందించే మనిషి ఎందుచేతనో ఓ పదిహేను రోజుల్నించీ లాబ్‌కేసి రావడంలేదు.

బహుశా ఒంట్లో బావుండకపోవచ్చు లేదా వూరెళ్లివుండచ్చు. ఏమైనా ఆ స్పెసిమన్‌ని కలెక్ట్ చేసుకొచ్చే బాధ్యత నామీద పడింది. నా సహాధ్యాయిని కబేలాకి వెళ్ళి స్పెసిమన్‌ని తీసుకురావడం జరిగేపనికాదు. ప్రొఫెసర్‌గారికి ఆమె దూరపుబంధువు. తెలివైనదే. కానీ ఈ చుట్టరికం వల్లనేమో ఎవరితోనూ కలివిడిగా వుండదు.

నా ఫ్రెండ్ మురళి ఆ అమ్మాయిముందు ఫోజు కొట్టడానికే నేనీ పనికి ఒప్పుకొన్నానని ఎత్తిపొడుస్తున్నాడు.

అదేమోగానీ, ప్రొఫెసర్‌గారు స్పెసిమన్‌ను తెమ్మంటే మారుమాట్లాడకుండా తలూపటంమాత్రం నిజం.

ఆ అమ్మాయి ''రాముడు మంచి బాలుడు సుమా!'' అన్నట్లు నన్ను ప్రశంసాపూర్వకంగా చూడడం కూడా నిజమే!

మురళి అన్నాకే నాకా విషయం తట్టింది.

రూంకి వచ్చాక కానీ నా బుర్ర స్పెసిమన్ సంపాదించడం ఎలాగా అన్నది ఆలోచించలేదు.

సందేహిస్తూనే మురళిని అడిగాను. అదుగో అప్పుడే అలా ఎత్తిపొడిచాడు.

వాడే నిన్న సాయంత్రం నన్ను కబేలాకి తీసుకెళ్ళాడు.

చర్మం వొలిచిన మేకలు, గొంతులు చించుకొని అరిచే గొర్రెలు, కాళ్ళు

వేలాడదీసిన కోళ్ళు ఎదురవుతాయేమోనని తల అటూ ఇటూ తిప్పకుండా నేలకేసి చూస్తూ నడిచాను.

'కొత్త పెళ్ళికొడకా, ఇంక తలెత్తు' అంటూ మురళి వ్యంగ్యంగా అనేసరికి తలెత్తాను.

నేనూహించిన దృశ్యాలుకానీ, శబ్దాలు కానీ అక్కడేమీ లేవు.

కబేలా అక్కడికి కొద్దిదూరంలో వుందని తరువాత తెలిసింది.

కసాయివాడంటే బుర్రమీసాలు, ఎర్రటి కళ్ళతో గళ్ళలుంగీ, పచ్చబనీను వేసుకొని, లావుపాటి తోలుబెల్టు పెట్టుకొని, ఓ పెద్దకత్తి పట్టుకొని వుంటాడని నా వూహ.

కానీ నా ఎదురుగా వున్న అతనిలో ఈ లక్షణాలు ఒక్కటి కూడా లేవు. పైపెచ్చు ఎంతో మర్యాదగా, "మీరెందుకు సార్ ఇక్కడికి రావడం. కబురుపెడితే నేనే వచ్చేవాడినిగా" అన్నాడు.

"తీరిగ్గా ఆశ్చర్యపోదువు కానీ ముందు నీక్కావల్సింది ఏమిటో చెప్పు" అని మురళి చిన్నగా అంటూ మోచేత్తో పొడిచాడు.

నాకు ఆవు శరీరభాగాలు కొన్ని కావలసివుంది.

ఆ వివరాలు అతనితో చెప్పాను.

నేను మర్నాడు వస్తాననీ, ఏ ఒక్క చిన్న నరం కూడా చిట్లకుండా, ఏ సన్నటినాళం కూడా తెగకుండా భద్రంగా తీసిపెట్టాలనీ చెప్పాను.

నాకు ప్రొఫెసర్‌గారి మాట గుర్తుకు వచ్చింది.

"వద్దులే, పొద్దున్న స్పెసిమన్ భద్రపరచడానికి కావలసిన సరంజామా అంతా తీసుకొస్తాను. నేవచ్చాకే స్పెసిమన్ తీసిద్దువులే" అని చెప్పాను.

అతను అందుకు ఒప్పుకొన్నాడు.

నన్ను కాస్త ముందుకెళ్ళనిచ్చి మురళి అతనితో ఏదో మాట్లాడాడు. బహుశా డబ్బుల గూర్చి అనుకొంటా.

తర్వాత స్పెసిమన్ కలెక్ట్ చేసుకోవడానికి కావలసిన గాజుతొట్టి, కెమికల్స్ కొనుక్కొచ్చాం.

ఉదయం అక్కడినుంచి పదిహేను నిముషాల్లోగా ఆ గాజు తొట్టితో లాబ్‌కి చేరడం కష్టం కనుక టాక్సీని మాట్లాడాం.

టాక్సీవాడు పొద్దుటే వచ్చేస్తానని చెప్పాడు.
మురళి నాతో రానని రాత్రే ఖచ్చితంగా చెప్పేశాడు.

వాడు రజాయిలో వెచ్చగా పడుకొని గుర్రుపెడుతున్నాడు.

జర్కిన్‌వేసుకొని తలుపు తీసుకొని బయటికి వచ్చాను.

మేలిముసుగులోంచి సిగ్గుతో బరువెక్కిన కళ్ళను అప్పుడప్పుడూ ఎత్తి కనుకొలుకుల్లోంచి చూసే పెళ్ళికూతురిలా పొగమంచులోంచి ఉషాకన్య ఓరచూపులు చూస్తోంది.

చేతులు రుద్దుకుంటూ రోడ్డుకటువైపున ఆగివున్న టాక్సీ దగ్గరికి వెళ్ళాను.

అది మేం రాత్రి మాట్లాడిన టాక్సీనే.

టాక్సీడ్రైవర్ పొద్దునే వచ్చి సీట్లో పడుకొని నిద్రపోయినట్లున్నాడు.

నేను అతన్ని లేపాను. ఇద్దరం కలిసి స్పెసిమన్ కలెక్ట్ చేసుకోవడానికి తీసుకొచ్చిన సరంజామాని వెనకసీట్లో సర్దాం.

నేను డ్రైవర్ పక్కన కూర్చున్నాను.

చలి బాగా వుంది.

జర్కిన్ కాలర్‌ని చెవులమీదికి లాక్కొని, చేతులు ప్యాంట్ జేబుల్లో పెట్టుకొన్నాను.

డ్రైవర్ కిటికీ అద్దాలన్నీ మూసేశాడు.

మేం వెళ్ళాల్సిన అడ్రస్‌ముందే చెప్పాను కనుక నేను నిశ్చింతగా బయటికి చూస్తున్నాను.

అద్దాలపై మంచు అప్పుడప్పుడు చిన్న చిన్న నీటిబిందువులుగా జారుతోంది. మసక అద్దాలపై ఈ చారలు విచిత్రమైన బొమ్మలు గీసినట్లుగా వున్నాయి.

ఇలాంటి ఉదయాలలో నాకు మావూరు గుర్తుకు వస్తుంది.

సెలవల్లో ఊరికి వెళ్లినప్పుడు పచ్చని పొలాలమీదనుంచి బద్ధకంగా లేచి వచ్చే నారింజ సూర్యుణ్ణి చూడడానికి నేను, చెల్లి తెల్లవారగట్లే లేచేవాళ్ళం.

నిజానికి పెదనాన్నే మమ్మల్ని లేపేవాడు.

సూర్యుడు వచ్చాక లేవడం ఆయనకు ఇష్టం వుండేదికాదు.

ఎందుకంటే ఆయనకు రోజూ చుక్కలకు వీడ్కోలు ఇచ్చికానీ సూర్యునికి స్వాగతం చెప్పే అలవాటులేదు.

స్కూలు వున్నన్ని రోజులూ రాత్రి ఆలస్యంగా పడుకొని, పొద్దున ఆలస్యంగా లేవడం మాకలవాటు.

మా ఊళ్ళో అన్ని అలవాట్లూ మారిపోయేవి.

చుక్కలు ఆకాశంలో ప్రత్యక్షం అవగానే భోజనం కానిచ్చి, వాకిట్లో వేసిన మంచాలపైకి చేరేవాళ్ళం.

నెమరు వేసుకొంటోన్న ఎద్దుల మెళ్ళోని చిరుగంటల శబ్దాన్ని వింటూ, పెదనాన్న చెప్పే కథలకి ఊకొడుతూ నిద్రపోయేవాళ్ళం.

అప్పుడే విచ్చుకొన్న పారిజాతాల మీద నుంచి వచ్చే పలుచని సువాసన నాకింకా జ్ఞాపకం వుంది.

పొద్దున లేచి నేను గడ్డిపోచలమీది మంచు బిందువులపై నాట్యమాడే లేత నారింజకిరణాల్ని గమనిస్తూవుండేవాడిని.

చెల్లి పెద్దమ్మతో పాటు కళ్ళాపినీళ్ళను తొక్కుతూ ముగ్గులు వేయడం నేర్చుకొనేది. నేను ఎన్నిసార్లు ప్రయత్నించినా ముగ్గుపిండితో ఓ చిన్నగీత కూడా గీయలేకపోయాను.

చెల్లి పువ్వులు, లతలు వేయడం తొందరగానే నేర్చుకొంది.
నాకు తువ్వాయితో ఆడుకోవడం అంటే ఇష్టం.
సోగకళ్ళు అంటే తువ్వాయి కళ్ళులాగా వుంటాయేమో!
నుదుటిమీద బొట్టు పెట్టినట్లుగా తెల్లటిమచ్చ వుండేది.
ఎంత చలాకీగా పరిగెత్తేదని!

పెద్దమ్మ తువ్వాయి తను పెట్టిన పూలమొక్కల్ని తొక్కేస్తుందని కోప్పడేది. ఎప్పుడూ తాడుతో కట్టిపెట్టమనేది.

''లేగదూడని ఆడుకోవద్దంటే ఎలాగా? అటూ ఇటూ గెంతకపోతే అది తువ్వాయి ఎలా అవుతుంది? నీవు తీసుకెళ్ళి ఆడుకోరా అబ్బాయి'' అనేవాడు పెదనాన్న నాతో.

చెల్లి పెద్దమ్మతో చేరి ముద్దబంతుల్ని కొరికేస్తుందని కారబ్బంతుల్ని తొక్కేస్తుందని చిట్టి చేమంతుల్ని చిందరవందర చేస్తుందని తువ్వాయిని విసుక్కునేది.

పాలు పిండేపని పెద్దనాన్న, పెద్దమ్మ స్వయంగా చేసేవారు.

చెల్లీ, నేను గిన్నెలు తీసుకొని తయారయ్యే వాళ్ళం.

పెదనాన్న తువ్వాయి తాగినన్ని పాలు తాగాకే పాలు పిండేవారు.

అందుకే నా గిన్నెలో ఎప్పుడూ కొద్దిపాలే వుండేవి.

పెద్దమ్మ దూడని వదిలిన కాసేపటికే బుడ్డాడ్ని కేకేసి, దూడని కట్టేయమనేది.

పెదనాన్న నాతో ''చూడు, చూడు. మీ పెద్దమ్మ తువ్వాయి పాలను దొంగతనం చేస్తోంది'' అనేవాడు.

పెదనాన్న ఎంత చిన్నగా అన్నా పెద్దమ్మ చెవిలో ఈ మాటలుపడేవి. పెద్దమ్మ రెండుచేతులు తిప్పుతూ, '' ఆ... ఇప్పుడేమో ఇలాగే అంటారు. తరువాత పిల్లలకి తలాచేరేడు పాలిమ్మంటారు. ఎక్కడినుంచి వస్తాయేమిటి'' అనేది.

పెద్దమ్మ ఇక మాతో మాట్లాడకుండా నురగపాలను తీసుకొని ఇంట్లోకి వెళ్ళేది.

ఆ వెనుకే నన్ను చూసి మూతితిప్పుతూ చెల్లి వెళ్ళేది.

పెదనాన్న నేను ఒకర్నొకరం చూసి నవ్వుకొనేవాళ్లం.

గత జ్ఞాపకాలతో చిన్నగా నవ్వుకుంటున్న నేను డ్రైవర్ సడెన్‌గా మలుపు తిప్పడంతో ప్రస్తుతంలోకి వచ్చాను.

డ్రైవర్ కారుని ఆ సందులో ఈ సందులో తిప్పి, చివరికి నిన్న కలిసిన అతని ఇంటి ముందు ఆపాడు.

కారు చూడగానే అతను ఎదురొచ్చి సీట్లోని సామాను అందుకొన్నాడు. నాకు గబగబా కుర్చీ తెచ్చివేశాడు.

మళ్ళీ, నాకు ఏమేం కావాలో ఎలా కావాలో అతనికి అర్థమయ్యేలా చెప్పాను.

పదిహేను నిమిషాల్లో పని అయిపోతుందని చెప్పి అతను వెళ్ళాడు.

చుట్టూ చూశాను.

సన్నని సందు.

అప్పుడే లేచి ఒక్కొక్కళ్ళు అటూ ఇటూ తిరుగుతున్నారు.

కొందరు పిల్లలు వచ్చి కారుని ముట్టుకొని వెళ్తున్నారు.

డ్రైవర్‌కి వారిని తరిమేయడంలోనే సరిపోతోంది.

నేను కూర్చున్న ఇంటి కాంపౌండ్‌ని కొయ్యలతో తడికలతో కట్టారు.

ఓ పక్క ముద్దబంతిపూలు వాటిని పెంచుతున్న యజమాని శ్రద్ధకి నిదర్శంగా బొద్దుగా వున్నాయి.

చిన్న మేకపిల్ల నా ముందు నుంచి పరిగెట్టుకెళ్ళింది.

నల్లగా నిగనిగలాడుతూ ముద్దుగా వుంది.

దానివెనకే పరిగెత్తి, ఓసారి దాన్ని నిమరాలనిపించింది.

దాని గెంతులు చూడగానే నాకు మా తువ్వాయి జ్ఞాపకం వచ్చింది.

ఇప్పుడు అది ఎన్నో తువ్వాయిలకు తల్లి అయివుంటుంది.

పెదనాన్నలో అప్పటి ఆరోగ్యం, ఉత్సాహంలేవు.

ఇంట్లోకి కావలసిన పాడి ఆవుల్ని వుంచి మిగిలిన వాటిని అమ్మేశారు.

నాకు ఈ వార్త తెలిసినప్పుడు, మా వూరి వీధుల్లోంచి మందలు మందలుగా బక్కచిక్కిన ఆవుల్ని, ఎద్దుల్ని జతలుగా కొమ్ములకు కట్టి పట్నంవైపుకు నడిపించుకుపోవడం గుర్తుకువచ్చింది.

ప్రతి శనివారం మాకు ఈ దృశ్యం కనపడేది.

పెదనాన్న బాధతో వాటిని కబేలాకి తీసుకెళ్తున్నారని చెప్పేవాళ్ళు.

పెదనాన్న ఎందుకో బాధ పడుతున్నారని మాకర్థమయ్యేది.

కానీ కబేలా అంటే ఏమిటో, అక్కడికి తీసుకెళితే ఎందుకు బాధపడాలో నాకుగానీ, చెల్లికి గానీ అర్థం అయ్యేదికాదు.

పెదనాన్న అవి వెళ్తున్నవైపు చూస్తూ, ''అవి ఇంక ఎవరికీ పనికిరావుగా! పనికివచ్చేవరకే వేటినైనా ప్రేమిస్తారు. చివరివరకు వాటినుండి లాభం పొందాలనుకొంటారు. ఆ తరువాత ఇలా...'' అనేవారు.

ఆపైన ఆయనకు గొంతుపెగిలేది కాదు

చదువు గొడవలోపడి నేను వూరికి వెళ్ళడం తగ్గిపోయింది.

కారణం ఏదైనా నిస్పృహతో నీరసించిన పెదనాన్నని, వెలవెలపోతోన్న చావిడిని చూడాలంటే నాకు బాధవేస్తుంది.

ఊరు వెళ్ళి వచ్చేసిన తరువాత కూడా ఆ జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే వుంటాయి.

మేకపిల్లని వెంటాడుతూ, నా ముందు నించి ఓ నాలుగేళ్ళపాప పరిగెత్తింది. చిన్న జడలకి కట్టిన రిబ్బన్లు వూడిపోయి వేలాడుతున్నాయి. పొట్టిపావడాని పైకి లాక్కుంటూ ఓ నిమిషంలో మాయమయింది.

ముద్దబంతులకు పోటీగా ఎండ పసుపు రంగును పులుముకుంటోంది. నేను లేచి కుర్చీని నీడవైపుకు జరుపుకొన్నాను.

ఇంతలో ఇంట్లోనుంచి అతని గొంతు వినిపించింది

"సాబ్‌కి చాయ్ అన్న ఇచ్చినావా లేదా?" అంటూ.

అతను బయటకు వచ్చాడు.

నా స్పెసిమన్‌ని అతని మనుషులు తీసుకొస్తున్నారని చెప్పాడు.

ఇంతలో రెండుజడలపాప అతన్ని ఇంట్లోకి పిలిచింది.

అతను వెళ్ళి చాయ్ తీసుకొచ్చాడు.

అతను ఎంతో మర్యాదగా నా చేతికి గ్లాసుని అందించాడు.

నా మట్టుకు నాకు ఆ నులివెచ్చని ఎండలో అలా కూర్చుని వేడివేడి టీ తాగడం ఓ వింత అనుభవం.

కట్టెలపొయ్యిమీద చేసిందేమో ఓ తమాషా అయిన వాసన వేస్తోందా టీ!

ఇంతలో అతని మనుషులు స్పెసిమన్‌ని తెచ్చి కారులో పెట్టారు.

అతని చాయ్‌కి ధన్యవాదాలు చెప్పడం మర్యాద అనిపించింది నాకు. అతనితో ఇంత మంచి చాయ్ తాగడం ఈమధ్యకాలంలో లేదన్నాను.

"అవును సాబ్, ఆ ఆవు చాలా బాగా పాలిచ్చేదేనంట! నుదిటిమీద బొట్టు పెట్టినట్లు తెల్లని మచ్చకూడా ఉంది"

అతను చెప్తున్నాడు.

నాకెందుకో మా తువ్వాయి గుర్తుకు వచ్చింది.

"మీకోసం కావలసినవి తీసేసిన తరువాత పిండినాను సాబ్! చాయ్‌కి పాలొచ్చినాయి..."

ఆ తరువాత నాకు అతని మాటలు వినపడలేదు.

చేతిలోని గ్లాసు ఎప్పుడు కిందపెట్టానో తెలీదు.

ఎందుకనో నా పేగుల గోడలను తన్నుకొని సెగలు, పొగలు కక్కుతూ పాలు నా గుండెల్లోకి ఎగతోసుకుని పొంగుతున్నట్లనిపించింది. కలలో నడుస్తున్నట్లు వెళ్ళి డ్రైవర్ పక్కన కూలబడ్డాను.

వెనుక సీట్లోని స్పెసిమన్ ఫక్కున నవ్వినట్లనిపించింది! ❁

విపుల జూన్ 1993